## పురుషులకు కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించబడిన కథ

"ఏమన్నారండీ వాళ్లు....?"

భర్త ఇలా వచ్చాడో లేదో అలా ఆత్రంగా అడగటం అది ఎన్నోసారో ఆవిడకే గుర్తు లేదు!

ఉస్సురంటూ పడక్కుర్చీలో శోషవచ్చిన వాడిలా పడిపోయిన బలరామయ్య గార్ని చూసేసరికి ఆవిడకి కర్తవ్యం గుర్తు కొచ్చింది... అప్పటికే ఏం జరిగిందో వాళ్లే మన్నారో కూడా తెలిసిపోయిందావిడకి. కాఫీతో తిరిగి వచ్చి, ఆయన ప్రక్కనే, నేలమీద చతికిల పడింది సుభద్ర.

అంతవరకు తలుపు చాటున ఏదో తీస్తున్న దాన్లా నటిస్తూన్న శిల్ప, లోపలికి వెళ్లిపోయింది.

పెరట్లో మామిడి చెట్టు క్రింద ఉయ్యాల ఊగుతున్న శృతి అక్కని చూస్తూనే ఒక్కక్షణం ఆగింది...

మౌనంగా, తల అడ్డంగా త్రిప్పింది శిల్ప.

"నేననుకుంటూనే ఉన్నాన్లే. ఆ ముంగు మొహం వెధవకి నీకన్నా డబ్బు, దస్కమే ముఖ్యమౌతాయని. అందరూ దేబిరికొట్టువెధవలే-ఛీ"—ఛీత్కరించింది.

"ఏమోనే! బియ్యే చదివాను, అందమైనదాన్ని తెలివైనదాన్ని-నన్నెవడైనా సరే కళ్లకద్దుకుని ఎగరేసుకు పోతాడని చాలా ధీమాగా ఉండేది. ఇప్పుడది అంతా హరించుకు పోయింది. ఎం.ఎ అయినా చదువ్దామంటే ఆర్థికంగా మనస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో..." నిర్లిప్తంగా అంటున్న శిల్పని చూసేసరికి- అంతవరకు మేకపోతు గాంభీర్యంతో, తెచ్చిపెట్టుకున్న నిర్లక్ష్యంతో మాట్లాడుతున్న శృతికి ఎక్కడలేని నీరసం ఆవరించింది.

నిజమే! అక్క బి.ఎ. తను బియస్సీ వెలగబెట్టారు. ఫస్టుక్లాసులో పాసయ్యారు. అందం, తెలివి తేటలు అన్నీ ఉన్నవాళ్లు. అయినా సరే ఏ వెధవకీ తమ ముఖాలు, తమ వ్యక్తిత్వంతో పని లేదు. ఎంతసేపూ కట్నం ఏం తెస్తారు? లాంఛనాల మాటేమిటి? అనే గోలే....

అప్పుడే ఐదు... ఐదున్నర ఏళ్లుగా పెళ్లి చూపులు, వాళ్లూవీళ్లూ సంబంధాలు తేవటం—అడ్డమైన వాళ్లూ వచ్చి, తిని పోవటం - ముప్పైవేలు కట్నం... నలభై వేలు - పెరుగుతూ పోతోందేకాని తరగటంలేదు. అక్క పెళ్లికే ఠికానా లేదు... ఇంక తన విషయం—తనకప్పుడే ఇరవైనాలుగున్నర ఏళ్లు... అక్కకి ఇరవై ఆరు... ఏమిటో ఈ జీవితం...

"ఏమేవ్! ఎక్కడున్నావ్? ఇలారా - శాస్త్రిగా రొచ్చారు", భర్త అరుపులతో పెద్దగ్లాసుడు పొగలు కక్కుతున్న కాఫీతో వచ్చింది సుభద్ర.

"ఏమ్మా! ప్రతీసారీ అన్నీ అటోఇటో ఏదో రకంగా పోయాయి. కానీ ఈసారి భేషైన సంబంధం తెచ్చాను... ఏదీ! ఆ కాఫీ ఇలా ఇవ్వు. నీ చేతికాఫీ అమృతంలా ఉంటుందమ్మా... ఇంతకీ సంబంధం విషయం- అబ్బాయి ఇన్‌కంటాక్స్ ఆఫీసులో పని చేస్తున్నాడు. రెండువేలు సంపాదిస్తాడు. ఎంతో మంచి వాళ్లు- తల్లీ దండ్రీ. వాళ్లతో చెప్పేశాను - మీరేమీ ఇచ్చుకోలేరనీ - ఏదో ఓ పదివేలు ఇచ్చి, గుడిలో చేసినట్లు కాకపోయినా, ఉన్నంతలో బాగా చేస్తారని చెప్పాను.. కానీ..."

"ఆగిపోయారేమండీ? చెప్పండి. లాంఛనాలేమైనా ఘనంగా..." అర్ధోక్తిలో ఆగిపోయి, నాన్చేశాడు బలరామయ్య.

"అబ్బే! అలాంటిదేం లేదు. కానీ కట్నం అక్కర్లేదన్నారండీ. కానీ...అబ్బాయికి సంవత్సరం క్రితమే పెళ్లి చేశార్ట. పెళ్లైన ఎనిమిది నెలలకే- అంటే నాలుగునెల్ల క్రితం పాపం- ఆ అమ్మాయి పోయిందట. పిల్లాడు సుతరామూ పెళ్లి చేసుకోనని భీష్మిస్తే, బ్రతిమాలి, బామాలి ఒప్పించార్ట. అందుకే కాస్త మంచి సాంప్రదాయం ఉన్న పేదకుటుంబాల్లో పిల్లను చేసుకోవాలని ఉంది—పిల్ల మాత్రం లక్షణంగా ఉండాలి అన్నారు. వెంటనే మన శిల్ప విషయం చెప్పాను..."

సుభద్ర మొహం అప్పటికే ఎర్రబడిపోయింది.

"ఆపండి! ఇంకానయం! లక్షణంగా ఉన్న నా కూతుర్ని రెండోపెళ్లి వాడికి కట్టబెట్టటం నాకిష్టం లేదు—" విసురుగా లోపలికి వెళ్లిపోయింది.

దీర్ఘాలోచనలో పడిన బలరామయ్యకేసి సందిగ్ధంగా చూశాడు శాస్త్రులు. "చూడండి! ముందరంటూ అసలు పెళ్లి చూపులు ఏర్పాటు చేయండి. తర్వాత విషయాలు తర్వాత చూద్దాం. అబ్బాయికి ఇరవై ఎనిమిదేళ్లు. లక్షణంగా ఉంటాడు. చూడ్డంలో తప్పేం ఉందండీ?" అంటూ తెగ నూరిపోయసాగాడు.

చివరికి ఆవచ్చే ఆదివారం నిర్ణయించి, బలరామయ్య చేత 'సరే' ననిపించుకుని, విజయగర్వంతో వెళ్లిపోయాడు.

విషయం విన్న శిల్ప చేష్టలు దక్కి నిల్చుండిపోయింది. ఇంత బ్రతుకూ బ్రతికి ఇంటివెనకాల చచ్చినట్లు 'రెండోపెళ్లి వాణ్ణా చేసుకునేది! ప్చ్! ఆడపిల్లగా ఎందుకు పుట్టించావురా భగవంతుడా! కన్నీళ్లు జలజల రాలాయి.

శృతి మాత్రం చిందులు వేసింది. తల్లి దండ్రుల మీద అరిచింది. అక్కతో వాదించింది. ఎవరెంత బాధపడినా, గుంపిచింపీలు పడినా, జరిగేది జరక్కమానదు.. అన్నట్లు ఆదివారం రానే వచ్చింది—

వచ్చిన వాళ్లకి కాఫీలు, టిఫిన్లు సరఫరా చేస్తున్న శృతికి హృదయం అగ్నిగోళంలా, దుఃఖభారంతో బరువుగా ఉంది. అక్కకి...

ఆమె ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ,

"పెళ్లి అమ్మాయిని తీసుకురండి" అన్నాడు శాస్త్రులు.

లోపలికి వెళ్లి-దిగులుగా , ఎప్పట్లాగే ప్రతి పెళ్లి చూపులకి-సంతలో గొడ్డులాగా ఎదురు చూస్తూ, రెడీగా ఉన్న శిల్పని వెంట బెట్టుకొచ్చింది సుభద్ర.

ఎప్పట్లాగే 'నీపేరేమిటమ్మా" లాంటి చచ్చుప్రశ్నలు వచ్చాయి.

పెళ్లికొడుకువంగి తల్లితో ఏదో అన్నాడు-ఆమె భర్తతో ఏదో చెప్పింది. ఆయన "ఒకనిమిషం ఇలా వస్తారా" అంటూ శాస్త్రుల్ని బైటికి పిలిచాడు.

బలరామయ్య, సుభద్ర ముఖముఖాలు చూసుకున్నారు - ఆ కళ్ళలో క్రొత్తకాంతి - ఆశలు...

ముక్కుపొడుం పీలుస్తూ లోపలికి వచ్చిన శాస్త్రులు—కాస్త ఇబ్బందిగా — "బలరామయ్యగారూ! అబ్బాయికి మన రెండో అమ్మాయి శృతి నచ్చిందిటండీ. మీ కభ్యంతరం లేకపోతే ఈ రోజే తాంబూలాలు తీసుకుంటారట..."

ఆగదిలో భయంకర నిశ్శబ్దం ఏర్పడింది. కొయ్యబారి నిలబడ్డ తల్లి తండ్రుల్ని, అవమానంతో జేవురించిన అక్క మొహాన్ని చూసింది శృతి.

"అమ్మానాన్నా ఏ మభ్యంతరం చెప్తార్లెండి! నా కిష్టమే" అంది... మళ్లీ ఎవరూ ఏమీ అనే లోపలే.

"కానీ చిన్న ప్రశ్న — మోహన్‌గారూ మీ భార్య ఎందుకు చనిపోయారు? అంటే... ఏ అనారోగ్యం వల్లా..." ఆగింది-కావాలనే.

అతడు 'బెబ్బెబ్బె...' అనసాగాడు—"మరేమో..."

అంతలో అతని తల్లి "అబ్బే అది గుర్తుకొస్తే మా అబ్బాయి మనసు వికలమై పోతుంది పావం! ఆపిల్ల ప్రొద్దున్నే కాఫీలు చేస్తూంటే చీరకొంగు అంటుకునీ...."

"చీర కొంగు దానంతట అదే అంటుకుందా లేక మీరేమైనా ,కాస్త అంటించి చూశారా?"

వాళ్ల ముఖాల్లో భయం కొట్టొచ్చినట్లుగా ఉంది - తత్తర పడసాగారు-

"కట్నంకోసం ఒకమ్మాయిని చంపేశారు. అందువల్ల ఇకమళ్లీ పెళ్లికాదన్న భయంతో ఇప్పుడు మంచి వాళ్లుగా, కానీ కట్నం అక్కర్లేని విశాల హృదయులుగా వచ్చారిక్కడికి. అదీ—ఒకపిల్లని చూడ్డాని కొచ్చి ఇంకోపిల్లని చేసుకుంటామనడానికి సిగ్గులేదూ" తీవ్రంగా, కొట్టినట్లుగా అందిశృతి -


"ఏవమ్మోయ్! మాటలు కాస్త మర్యాదగా..."

"ఛీ-నోర్మూయ్! ముందర బైటికి నడవండి - గెటౌట్.. చంపేస్తాను మిమ్మల్నందర్నీ" సంవత్సరాల బడబాగ్ని అశాంతి అగ్ని పర్వతంలా బ్రద్దలై లావాలాంటి మాటల రూపంలో వెలువడింది.

రౌద్రంగా ఉన్న శృతిని చూసి, ఎక్కడి వాళ్లక్కడే పారిపోయారు. 'శృతీ...చెల్లీ—"అంటున్న శిల్పని గట్టిగా కౌగలించుకుని వెక్కివెక్కి ఏడవసాగింది—

రెండు రోజులతర్వాత...

కూతుళ్లకేసి చూడటానికే గిల్టీగా ఫీలవుతూ -



"అలాంటి వెధవల్ని పైగారెండో పెళ్లివాణ్ణి అసలు పెళ్లి చూపులకెందుకు రానిచ్చారని" గడ్డిపెడుతున్న పెళ్లాంతో మాట్లాడలేక, పేపరు ముఖానికి అడ్డం వేసుకుని ముందరిగదిలో కూర్చుని ఉన్నాడు బలరామయ్య-

పేపర్లోకి చూస్తున్నాడేగాని - బుర్ర ఆలోచనలతో, బ్రద్దలయ్యేలా ఉంది. గవర్నమెంటు ఆఫీసులో గుమాస్తాగా ఎదుగూ బొదుగూ లేని తన జీ(వి)తంలో చచ్చి, చెడి కూడబెట్టినది ఇరవైఐదువేలు- ముఫ్ఫై ట్వెన్‌టీ ఫైవ్ థౌజండ్! ఒక పెళ్లి భోజనానికి చాలదు - అలాంటిది రెండు పెళ్లిళ్ళు — హే భగవాన్! పెళ్లి చేసి పంపించేసే ఉద్దేశ్యంతో, చేసేయగలననే ధీమాతో చదువులో మెరికల్లా ఉన్న పిల్లల్ని డిగ్రీతో మాన్పించేసి, ఆ పైచదువుల కయ్యే డబ్బుకూడబెట్టి - పెళ్లిచేసి ఉద్ధరిద్దామని - ఇప్పుడు వాళ్లని రెంటికీ చెడ్డ రేవళ్లుగా చేసేశాడు తాను— ఎంత దౌర్భాగ్యం... ఇప్పుడేం చేయాలి...

ఇంతలో కళ్లు ఒక వార్తని చూడ్డంతో గుండె ఝల్లుమంది నోరెండిపోయి పిడచగట్టుకు పోయింది. "కట్నం ఇవ్వలేని కారణంగా పెళ్లికాని అమ్మాయిల ఆత్మహత్య..." తన బంగారు తల్లులు కూడా అలాంటి పనేదైనా చేస్తే తట్టుకోగలడా తను... అమ్మో...

"నాన్నా..."

ఉలిక్కిపడ్డాడు బలరామయ్య. పేపరు క్రింద పడేసి, తమకేసి వెర్రిగా, ఆత్రంగా చూస్తున్న తండ్రిని చూస్తే జాలేసింది - వాళ్ళకి.

"నాన్నా! ఈక్షణం నించి నా పెళ్లి విషయం మర్చిపొండి—" శిల్ప. నిశ్చలంగా... "నాది కూడా"—దృఢంగా అంటున్న శృతి.

"నాకు పెళ్లి అక్కర్లేదు. ఎటువంటి ఇంటరెస్టు లేదింక పెళ్లిలో-నాన్నా! మీరు చెయ్యలేక పోతున్నారని కాదు - నాకు చేసుకోవాలని లేదు."

"అసలు పెళ్లి చేసుకుని ఇంకోడి వంచని తిట్లు, అవమానాలకి గురౌతూ బ్రతికే బ్రతుకే మాకొద్దు. కట్నం ఇచ్చి పెళ్లి చేసి పంపించినా మళ్లీ "అదివట్రా, ఇదివట్రా" అని పుట్టింటికి తరమరన్న గ్యారంటీ ఏదీ? ఆ అనిశ్చిత జీవితం కోసం - అదే పెళ్లికోసం ఐదేళ్లు వ్యర్థం చేశాం - అది చాలు. ఇంకొక్క క్షణం కూడా వృధా కాకూడదు.."

శృతి గొంతు ఉద్వేగంతో హెచ్చటంతో పరుగున వచ్చింది సుభద్ర - 'ఏమైందా' అని ఖంగారు పడుతూ.

"మరి... పెళ్ళొద్దంటే ఏం చెయ్యబోతున్నారు?" కలలో మాట్లాడుతున్నట్లు - అడిగాడు బలరామయ్య.

"ఉద్యోగం... ఏదో ఒకటి-" మీరేమంటారు అన్నట్లు చూస్తున్న శిల్పని చూస్తూ గుడ్లనీళ్లు కక్కుకుంది సుభద్ర - చక్కా పెళ్లి చేసుకుని పిల్లా పాపలతో...


"డిగ్రీలు చదివిన వాళ్లకి ఉద్యోగాలెక్కడొస్తాయి తల్లీ! డబల్ పోస్టుగ్రాడ్యుయేట్స్‌కే గతిలేదు ఈ రోజుల్లో," బలరామయ్య అసహాయంగా అన్నాడు.

"నాన్నా!" నెమ్మదిగా అంది శృతి.

"చూడండి! నాకెప్పటినుంచో ఒక భయం ఉంది - తీరా పెళ్లి కాకపోతే ఏం చేస్తాం అని? ఇప్పుడు అనుకున్నంతా అయింది. కానీ నాకిప్పటి భయం, అసహాయత్వం లేవు. జీవితం నాకు చాలానే నేర్పింది. ఇదే మీకు మగపిల్లలమై ఉంటే చక్కగా చదివించి ఉద్యోగాల్లో పెట్టేవారుగా నాన్నా? ఆడపిల్లలమై పోయామని ఇలా అన్యాయం చేస్తారా? మిమ్మల్ని వేలెత్తి చూపుతున్నాననుకోకండి! అందరు తల్లిదండ్రుల్నీ ప్రశ్నిస్తున్నాను. మగపిల్లలకైతే పెళ్లి ముఖ్యం అని ఇంట్లో మమ్మల్ని కూర్చోబెట్టినట్లు కూర్చోబెడతారా?

"ఇప్పుడు చూడండి! ఆడపిల్లలకే ఆర్థికభద్రత, స్వాతంత్ర్యం కావాలంటే ఎలా వస్తాయి? దానికి తగిన చదువులేదు. మమ్మల్నిపైకి చదివించి, లేదా ఉద్యోగాల్లో జేరనిచ్చి ఉంటే ఈ పాటికి "జీవితంలో పెళ్లి ఒక అంశం" అనే విషయాన్ని గ్రహించి, ఎటువంటి ఆదుర్దా, భయం లేకుండా ఉండేవాళ్ళం. కాని మీరలా చేయలేదు. "జీవితమంటేనే పెళ్లి" అన్నట్లు పెంచారు..." ఆవేశంగా కోపంగా మాట్లాడుతున్న శృతిని చూసి అవాక్కైపోయారు మిగిలిన ముగ్గురూ.

"తనకంటె చిన్నదైనా ఎంత ధైర్యస్థురాలు! ఎంతబాగా




జీవితాన్ని విశ్లేషించి, ఆకళింపుచేసుకుంది!" అని అనుకోకుండా ఉండలేకపోయింది శిల్ప.

మంత్రముగ్ధుల్లా తనకేసి చూస్తున్న తల్లి దండ్రుల్ని సావధానంగా చూసింది శృతి. తను ఉపోద్ఘాతం బాగానే చెప్పింది. ఇప్పుడు అసలు విషయాని కొస్తే, అర్థం చేసుకుని ఆశీర్వదిస్తారో లేదో చూడాలి - శాయశక్తులా ప్రయత్నించాలి...

"నాన్నా! నేనేదో చెప్పబోతున్నానని తెలిసిందని ఆశిస్తాను... మనకి బాంకులో ఉన్న మొత్తం సేవింగ్స్ ఎంత ఉంటాయి?"

"అదెందుకే ఇవుడు..." ఏదో అనబోతున్న సుభద్రని వారించి, "దగ్గరదగ్గర వడ్డీ అవీ అన్నీకలిపి ఇరవై ఎనిమిది వేలుంటుంది," చెప్పాడు. కూతురు ఏదో సీరియస్‌గా చెప్పబోతోందని గ్రహించాడు.. అదీ ఏమిటో ఆయనకు అంతుచిక్కలేదు.

శిల్పకి ముందరే తెలిసి ఉండటంతో, చెల్లెలి వాక్చాతుర్యానికి, మేధా సంపత్తికి ముఖ్యంగా కార్య శూరత్వానికి నిజంగా అబ్బుర పడుతూంది.

సుభద్రమ్మకేమిటో అంతా అయోమయంగా ఉంది. "మీరు పేపర్లో చూసే ఉంటారు ఓ నెలక్రితం-బాంకు వాళ్లు 'స్త్రీశక్తి' అనే లోన్ పథకం రూపొందించారు - స్త్రీలకోసం.

అక్కా, నేను కలిసి ఓ నలభై వేలు లోన్‌లో తీసుకుని, ఒక రెడీమేడ్ బట్టల షాపు, దానితో పాటే టైలరింగ్ సెక్షన్ తెరుద్దామనుకుంటున్నాం. ఏమైనా పైన అవసరమైతే బాంకులో మనకున్న ఇరవైఎనిమిదివేలు అక్కరకొస్తాయి. షాపులోకీ, టైలరింగ్‌కీ అభాగినులైన ఆడవాళ్లనే తీసుకుని వారికీ జీవనోపాధి కల్పించాలని నిశ్చయించుకున్నాం. కొంచెం నిలదొక్కుకుని, లోన్ తీర్చాక, ఒక బటిక్, బ్యూటీపార్లర్ ఇలా విస్తరించాలనీ, అక్రమాలు, అన్యాయాల పాలౌతున్న స్త్రీలనే ఏరికోరి పనిలో పెట్టుకోవాలనీ నిర్ణయించుకున్నాం..." ఆత్మ స్థైర్యంతో, క్రొత్త ఆశలుచిగురుస్తుండగా బంగారు భవిష్యత్తుని ఊహించు కుంటూ చెప్పుకుపోతున్న శృతిని ఆపింది సుభద్ర.

"చాలు చాల్లేవే! ఆడపిల్లలై ఉండీ - తగుదునమ్మా అని షాపులు తెరుస్తార్ట షాపులు! లోకం నవ్విపోదూ! ఫలానావాళ్ల పిల్లలు బట్టలు కుడుతున్నారు, అమ్ముకుంటున్నారంటే తలవంపులు కాదూ... హవ్వ"-నోరు నొక్కుకుంది.

"అమ్మా! ఇన్నాళ్లూ పెళ్లి చూపులకొచ్చి, మెక్కిపోతున్న సవాలక్ష మంది ముందర వీడితో కాకపోతే వాడితోనైనా పెళ్లౌతుందేమోనని ఎదురుచూస్తూ ఇంకా ఎన్నాళ్లు గడపమంటావ్? మీకూ ఎవరూ లేరు - మాకూ ఎవరూ వద్దు. మనం ఒకళ్లకొకళ్ళం -నల్గురం హాయిగా, ఏ చీకుచింతా లేకుండా సుఖంగా బ్రతుకుదాం. మేం ఆడపిల్లల మన్న సంగతి మర్చిపో! "పిల్లలం" అని మాత్రమే అనుకో అదైనానీకు మనశ్శాంతి కల్గిస్తుందేమో చూద్దాం. మమ్మల్ని మా జీవితాలు చక్కదిద్దుకుని, తలెత్తుకుని గర్వంగా బ్రతకనీయండి. లోకానికి భయపడితే జీవితాలు దగ్ధమైపోగలవు. హద్దుల్లోలేని దేదీ రాణించదు - సమాజానికి అంతగా భయపడక్కర్లేదు - మేమేం కాని పని చేయబోడం లేదు -" ఎంతో శాంతంగా, మితభాషిగా ఉండే శిల్ప మాటల్లోని జీవిత నగ్నసత్యాన్ని అర్థాన్ని చూసిన బలరామయ్య నిజంగా గర్వపడ్డాడు - ఆక్షణంలో ఆయనకి గుండెలమీద కుంపట్లలా ఉన్నారనుకున్న కూతుళ్లు - ఆస్థాయినించి ఎంతో - ఎంతెంతో ఎత్తుకు ఎదిగిపోయారని అర్థమైంది.

ఇద్దర్నీ మౌనంగా దగ్గరికి తీసుకున్నాడు.

"తండ్రికి చెప్పేంతటి, తండ్రిని మించిన తనయలనిపించుకున్నారమ్మా! రేపే బాంకు కెళ్దాం..." అన్నారు.